

అడిషనల్ కమిషనర్ ప్రొద్దుటూరుకు బదిలీ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 31: నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌ను కడప జిల్లా ప్రొద్దుటూరు కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. దీర్ఘకాలంగా కర్నూలులో విధులు నిర్వహిస్తున్న పీవీ రామలింగేశ్వర్‌ను ప్రొద్దుటూరుకు బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.



పెద్దకడబూరులో అధిక వర్షాలతో నీట మునిగిన పత్తి పంట

ఎడతెరిపి లేని వాన

- నీట మునిగిన పైర్లు
- మరో నెల గడిస్తే చేతికి పంటలు
- అన్నదాతల్లో ఆందోళన
- ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కర్నూలు జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు వర్షం ఆగకుండా కురవడంతో వాగులు, వంకలు నిండాయి. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు పడితే.. కొన్ని మండలాల్లో భారీగా వానలు కురిశాయి. పత్తి, టమోటా, ఉల్లి వంటి ప్రధాన పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హాలహర్వి మండలం మేదేహాల్ గ్రామంలో మిరప పంట, చిరుమాన్‌దొడ్డి గ్రామంలో టమోటా పంట నీట మునిగింది. గత సంవత్సరం వర్షాభావ పరిస్థితులు రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. ఈసారి పంటలు చేతికి అందుతాయన్న ఆశతో అన్నదాతలు ఉన్నారు. అయితే పంటలు చేతికందే సమయంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలన్నీ నీటి పాలై నష్టపోతామో అనే ఆందోళన రైతుల్లో నెలకొంది. మరో నెల రోజుల్లో పంటలన్నీ చేతికి అందుతాయని, కనీసం ఇప్పటి నుంచైనా వర్షం సక్రమంగా కురిస్తే తాము లాభాలు చూస్తామని రైతులు ఆశిస్తున్నారు.



కోసిగి మండలంలో కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయిన దేవర బెట్ట కల్వర్టు

ఆశాజనకంగా వర్షపాతం

కర్నూలు రూరల్‌లో 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోసిగిలో 42, కర్నూలు అర్బన్‌లో 36.4, పెద్దకడుబూరులో 35.4, చిప్పగిరిలో 35.2, ఎమ్మిగనూరులో 34.8, మంత్రాలయంలో 34, దేవనకొండలో 27.6, కల్లూరులో 27.2, గోనెగండ్లలో 26.4, నందవరంలో 23.2, ఓర్వకల్లులో 20ఎం.ఎం., క్రిష్ణగిరిలో 15.6, వెల్దుర్తిలో 14.4, సి.బెళగల్‌లో 13.4, గూడూరులో 11.2, కోడుమూరులో 10.6, హొళగుందలో 10.4, హాలహర్విలో 9.8, మద్దికెరలో 9 ఎం.ఎం., వర్షపాతం నమోదైంది. జిల్లా అంతటా సగటున రెండు రోజులుగా 19.8 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. వర్షం నమోదైంది. ఇప్పటిదాకా ఖరీఫ్ సీజన్ జూన్ నెలలో 77.7 వర్షం నమోదు కావాల్సి ఉండగా 140 ఎం.ఎం., నమోదైంది. జూలై నెలలో 90.7 వర్షం రావాల్సి ఉండగా.. 56.7 ఎం.ఎం., వర్షం నమోదైంది. ఆగస్టులో 116.2 ఎం.ఎం., వర్షం పడాల్సి ఉండగా.. 200.1 ఎం.ఎం., వర్షపాతం నమోదైంది. మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగిసిపోతుండటంతో ఇప్పటి నుంచి సక్రమంగా నిర్ణీత వ్యవధిలో కురిస్తే రైతులు సాగు చేసిన పంటలు సజావుగా వారి చేతికి అందే అవకాశం ఉంది.



గోనెగండ్ల: పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు
08518-277305

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా సూచించారు. ఇందు కోసం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 08518-277305 నెంబరుకు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రెవెన్యూ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్ రహదారులు, భవనాలు తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సమయంలో తగిన సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, వంకల వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.



ఆత్మకూరులోని కేజీరోడ్డుపై నేలకూలిన భారీ వృక్షం

ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

కర్నూలు రూరల్: నగరంలోని కర్నూలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో ఎం.శేషిరెడ్డి శనివారం తెలిపారు. శని, ఆదివారాల్లో అతి భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే 99120 69678, 63037 56113, 81217 86680 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



స్థానికులకు ఉపాధి అవకాశాలు

- మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్
- ఇసుక రీచ్ ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా అధికారులు

కౌతాళం, ఆగస్టు 31: ఇసుక రీచ్ ప్రాంతాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించి వలసలను నివారిస్తామని మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. మండల పరిధిలోని గుడికంబాలి, మరళి, నదిచాగి గ్రామాల్లో శనివారం జిల్లా మైనింగ్ అధికారులు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లోని ఇసుక రీచ్‌ల ఏర్పాట్లపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి రీచ్‌ల వద్ద ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నదులలో ఇసుకను డంప్ చేసుకుంటామని నదులలో ఒక మీటరు లోతు వరకు మాత్రమే తోడి పర్యావరణ అనుమతుల ప్రకారం ఇసుకను డంప్ చేయాలని తెలిపారు. ఇందుకు గుడికంబాలి గ్రామస్థులు మాట్లాడుతూ గతంలో ఇసుకరీచ్‌ల పేరిట తమ పొలాల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదన్నారు. దీంతో పంటలు పండించుకునేందుకు వీలు లేకుండా దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతిన్నాయన్నారు. రాత్రి, పగలు ఇసుక టిప్పర్లు తమ గ్రామంలో వెళ్తుండటంతో రహదారులు ధ్వంసం అయ్యాయన్నారు. నదీతీరాన ఉన్న పొలాల్లో వేసిన బోర్లు నీరు అందక ఎండిపోయాయని తమకు కనీసం తాగేందుకు కూడా వేసవి కాలంలో నీరు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు మితిమీరిన వేగంతో గ్రామాల్లోకి వస్తుండటంతో గత ఏడాది గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి కాలు విరిగిపోయినా ఆ కుటుం బానికి ఎలాంటి నష్టపరిహారం అందించలేదన్నారు. ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచ నలు నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఇరిగేషన్ ఈఈ శైలేశ్వరరావు, ఆర్‌ఐ రాజ శేఖర్‌గౌడ్, వీఆర్వో నాగార్జున, సర్పంచ్‌లు సిద్దేశ్, మల్లయ్య, మహేష్ తదితరులు ఉన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు

విద్యుత్‌శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఉమాపతి



కల్లూరు, ఆగస్టు 31: ఉమ్మడి కర్నూలు జిల్లాలో గణేష్ మండపాల్లో తాత్కాలిక విద్యుత్ సరఫరాకు నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రమాదాల నివారణకు సహకరించాలని శనివారం ఎస్ఈ యం.ఉమాపతి పిలుపునిచ్చారు. విద్యుత్‌శాఖ పరిధిలోని అన్ని డివిజన్లలో గణేష్ మండపాల నిర్వాహకులు ఆయా డివిజన్లు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఈఈలు, ఏడీఈ, ఏఈలను కలిసి కనీస చార్జీలు చెల్లించి అధికారులకు సహకరించాలన్నారు. సమీపంలోని మీసేవా, సచివాలయాల్లో రుసుము, చార్జీల చెల్లింపుతో పాటు గణేష్ మండపాల నిర్వాహకుల సమ్మతిని అధికారులకు తెలియజేయాలని ఎస్ఈ కోరారు. డివిజన్ల వారీగా అధికారులు తప్పకుండా కనీస చార్జీలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శ్రీమఠం హుండీ ఆదాయం

రూ.10.59 కోట్లు




వివరాలను వెల్లడిస్తున్న శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, ఆగస్టు 31: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల్లో శ్రీమఠానికి రూ.10.59 కోట్లు ఆదాయం సమకూరింది. గడిచిన 29 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయం లెక్కింపు శనివారం పూర్తయింది. శ్రీమఠం హుండీ ద్వారా రూ.3.23 కోట్లు రాగా, ఆన్‌లైన్‌లో భక్తుల నుంచి రూ.1.80 కోట్లు, చెక్కు రూపాల్లో విరాళంగా రూ.1.60 కోట్లు, బ్యాంకుల ద్వారా రూ.1.20 కోట్లు వచ్చింది. అదేవిధంగా ఏడు రోజుల సేవలకు రూ.1.62 కోట్లు, పరిమళ ప్రసాదం నుంచి రూ.50 లక్షలు వచ్చింది. మొత్తంమీద రూ.10.59 కోట్లు ఆదాయం సమకూరినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులు, శ్రీమఠం అధికారులకు అభినందనలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి


డీపీవో నాగరాజు నాయుడు



కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 31: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏర్పడే సమస్యలను ఎదుర్కొనేందుకు పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఆదేశించారు. వర్షాల కారణంగా మురుగు కాలువలు పొంగి పారిశుధ్య సమస్యలు తలెత్తే అవకాశాన్ని నివారించాలన్నారు. అదేవిధంగా తాగునీటి పైపులైన్లు, లీకేజీల ద్వారా తాగునీరు కలుషితం కాకుండా తక్షణమే మరమ్మతులు పనులు చేయించాలని కోరారు. ట్యాంకులు నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేపట్టాలని, అవసరమైతే సూపర్ క్లోరినేషన్ కూడా చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో తరచుగా ఫాగింగ్ చేపట్టి దోమల ద్వారా ప్రబలే వ్యాధులను అరికట్టాలని సూచించారు. కరెంటు సమస్య కారణంగా తాగునీటి ఇబ్బంది కలగకుండా వీలైన చోట జనరేటర్ సదుపాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. క్లిష్ట పరిస్థితులలో ప్రజలకు సేవలందించేందుకు గాను గ్రామస్థాయిలో పని చేసే సిబ్బంది మొబైల్ నెంబర్లకు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం, ఆగస్టు 31: శ్రీశైలంలోని నీలం సంజీవరెడ్డి జలాశయానికి శనివారం వరద ప్రవాహం భారీగా కొనసాగింది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 3,53,823 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 912 క్యూసెక్కులు మొత్తం 3,54,735 వరద వస్తోంది. డ్యాం అధికారులు 2 క్రస్టుగేట్లను 10 అడుగుల మేర, 8 క్రస్టుగేట్లు 18 అడుగుల మేర ఎత్తి 3,54,735 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం రాత్రి 9 గంటల సమయానికి జలాశయానికి 3,85,882 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.70 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.8824 టీఎంసీలుగా నమోదైంది.



శ్రీశైలం జలాశయం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

పశు బీమా.. రైతుకు ధీమా ..

- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- గత వైసీపీ పాలనలో అటకెక్కిన పథకం
- టీడీపీ రాకతో జిల్లాలో మళ్లీ ప్రారంభం

కొలిమిగుండ్ల, ఆగస్టు 31 : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, పాడి పరిశ్రమకు ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోంది. ఇందులోభాగంగానే పశు బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. పాడి పశువు మరణించిన రోజుల వ్యవధిలోనే సంబంధిత రైతులకు సాయం అందుతుంది. దీంతో ఆ రైతు తిరిగి కొత్త పశువులను కొనుగోలు చేయడానికి ఇది ఉపకరిస్తుంది. పాడి పశువులకు చెల్లించే బీమా సొమ్ములో ప్రస్తుత ప్రభుత్వం రాయితీ కల్పించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకైతే 80 శాతం, మిగిలిన రైతులకు 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో మామూలు పశువులకు రూ.15 వేలు, మేలు జాతి పశువులకు రూ.30 వేల బీమా సదుపాయం కల్పించారు. అయితే రైతులు ఇంతకంటే ఎక్కువ సొమ్ముకు బీమా చేసుకోవాలని భావిస్తే అదనంగా అయ్యే మొత్తాన్ని రైతులే భరించాల్సి ఉంటుంది. ఒక్కో పశువుకు గరిష్ఠంగా రూ.1.10 లక్షల వరకు బీమా చేసుకునే అవకాశం ఉంది. ఈ బీమా సొమ్ముకు మూడేళ్ల కాల పరిమితి ఉంటుంది. పాడి పశువులతోపాటు గొర్రెలు, మేకలు, పందులకు సైతం రాయితీపై బీమా చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఒక కుటుంబం నుంచి ఐదు పశువులకు బీమా చేసుకోవచ్చు. జీవాలకు సంబంధించి ఒక కుటుంబానికి 50 గొర్రెలు లేదా మేకలకు అవకాశం ఉంది. దీనికి సంబంధించి, నంద్యాల జిల్లాకు రూ.12 లక్షల బీమా రాయితీ సొమ్మును ప్రభుత్వం కేటాయించింది.



గడ్డి మేస్తున్న గొర్రెలు, మేకలు

వైసీపీ పాలనలో నష్టపోయిన రైతులు

పరిశ్రమను పూర్తిగా నీరు గార్చారు. పశువుల బీమాకు మొదటి నాలుగేళ్లలో ఒక్క రూపాయి విడుదల చేయలేదు. పశువు మరణిస్తే నష్ట పరిహారం చెల్లిస్తామని, బీమా అవసరం లేదని చెప్పిన వైసీపీ ప్రభుత్వం పాడి రైతులను నిలువునా ముంచింది. నష్ట పరిహారం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చివరి సంవత్సరం ఎన్నికల ముందు పశు బీమా పథకం అంటూ హడా వుడి చేశారు. విడుదల చేసిన మార్గ దర్శకా లు లోప భూయిష్టంగా ఉండడంతో రైతులు బీమా చేయడానికి సైతం మొగ్గు చూపలేదు. కూటమి అధికారంలోకి రావడం తో పాడి రైతులకు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది.

మార్గదర్శకాలు ఇలా..

పశువులకు బీమా చేసుకునే రైతు బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులైతే తెల్ల రేషన్‌కార్డు అందించాల్సి ఉంటుంది. స్థానిక పశు వైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి బీమా చేసుకోవాలి. పాడి పశువులకు బీమా చేసే సమయంలో పశువుకు చెవి పోగు(ట్యాగ్) వేస్తారు. ఏదైనా అనుకోని కారణాల వల్ల చెవి పోగు పడిపోతే వెంటనే అందుబాటులో ఉన్న పశువైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి, తిరిగి చెవిపోగు వేయించుకోవాలి. పశువుకు చెవి పోగు ఉంటేనే బీమా పరిహారం అందుతుంది. బీమా చేయించిన పశువును విక్రయిస్తే వారం రోజుల్లో అధికారులకు తెలియజేయడం వల్ల యజమాని పేరు మార్చుకునే అవకాశం కూడా ఉంది. ఏదైనా సంఘటనతో పశువు మరణిస్తే వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఉన్న పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలి. బీమా సర్వేయర్ వచ్చే వరకు చెవి పోగును తీయరాదు. పశు పోషకులు ఈ నిబంధనలు తప్పక పాటించాల్సి ఉంటుంది.

పాడి పశువుల బీమా సొమ్ము, రైతు చెల్లించాల్సిన వాటా వివరాలు

లబ్ధిదారులు	అందించే భీమా	ప్ర. రాయితీ	లబ్ధిదారుని వాటా
ఎస్సీ, ఎస్టీ రైతులు	రూ.15,000	రూ.768	రూ.192
	రూ.30,000	రూ.1536	రూ.384
సాధారణ రైతులు	రూ.15,000	రూ.480	రూ.480
	రూ.30,000	రూ.960	రూ.960
గొర్రెలు, మేకలు	రూ.6000	రూ.135	రూ.54

అవగాహన కల్పిస్తున్నాం

పశు బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మండలాల వారిగా అధికారులకు దిశా నిర్దేశం చేశాం. నంద్యాల జిల్లాకు రూ.12లక్షల బీమా సొమ్మును ప్రభుత్వం కేటాయించింది. రైతులకు అవసరమైతే మరింత కేటాయింపులు జరుగుతాయి. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ గోవింద్ నాయక్,
నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

లద్దగిరి ఎస్‌ఎంసీ ఎన్నికల్లో

రహస్య ఓటింగ్

ఆదేశించిన హైకోర్టు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 31: మండలంలోని లద్దగిరి ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలను రహస్య పద్ధతిలో జరిపించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఫిర్యాది షేక్ మహబూబ్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న జరగాల్సిన ఎన్నిక కోరం లేక వాయిదా పడిందని అన్నారు. తిరిగి 17న చేపట్టగా మరోమారు వాయిదా పడినట్లు తెలిపారు. రాజకీయ, అసాధారణ పరిస్థితుల దృష్ట్యా ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలగకుండా ఎన్నిక జరిపించాలని కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో రహస్య పద్ధతిలో ఎన్నిక నిర్వహించాలని సంబంధిత అధికారులను కోర్టు ఆదేశించిందని వివరించారు.

3న జిల్లా స్థాయి ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 31: స్థానిక డీఎస్‌ఏ అవుట్ డోర్ స్టేడియంలో ఈ నెల 3న ఉదయం 10 గంటలకు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి (బాలుర, బాలికలకు) ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అలాగే ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13 నుంచి 14వ తేదీ వరకు కర్నూలులో జరగబోయే రాష్ట్ర స్థాయి ఆట్యా పాట్యా చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని 01.01.2007 అర్హత ఉండాలని, జిల్లా ఆట్యా పాట్యా సంఘం కార్యదర్శి బి. పవన్ తెలిపారు. వివరాలకు 9393855450, 9032104158 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆరు రోజులపాటు సీపీఐ ఆందోళన

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 31: సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు అధిక ధరలు తగ్గించాలని కోరుతూ 1వ తేదీ నుంచి 6 వరకు ఆందోళనలు చేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగు పరచాలని, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో జరిగే ఆందోళనలు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 6న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

6న హ్యాండ్‌బాల్ అంతర్ పాఠశాలల పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 31: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6న స్థానిక డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల బాలబాలికల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి పి. సువర్ణ శనివారం తెలిపారు. విజేతలతో పాటు మూడో స్థానంలో నిలిచిన జట్లకు కప్పులతో పాటు పతకాలను బహూకరిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లను సబ్ జూనియర్ అండర్-15 రాష్ట్ర స్థాయికి హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్స్‌కు పంపుతున్నట్లు ఆమె తెలిపారు. ఎంపికలో పాల్గొనే ఒక్కో క్రీడాకారుడు రూ.10 దరఖాస్తు రుసుము చెల్లించి ఈ నెల 5వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గ్రానైట్ తరలిస్తున్న లారీకి జరిమానా

కర్నూలు(అర్బన్), ఆగస్టు 31: ఒంగోలుజిల్లా చీమకుర్తి నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు గనుల శాఖ డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఉదయం కర్నూలు నగర శివారులో తనిఖీలు నిర్వహించగా రికార్డులు లేని గ్రానైట్ లారీని గుర్తించామన్నారు. దీంతో లారీ యజమాని శంకర్ రెడ్డికి రూ.3 లక్షల జరిమానా విధించామని తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

మహానంది, ఆగస్టు 31: మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన గుమ్మా లక్ష్మీదేవి (43) ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతి చెందింది. శనివారం ఉదయం యథావిధిగా బర్రెలను మేపేందుకు గ్రామ శివారులోని బైరవాని చెరువు పరిసరాల్లోకి లక్ష్మీదేవి వెళ్ళింది. ఈ క్రమంలో కొన్ని బర్రెలు చెరువులోకి వెళ్ళడం గమనించిన ఆమె వాటిని తప్పించబోయి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. సాయంత్రం అయినా ఇంటికి రాక పోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు చెరువు పరిసరాల్లో వెతకగా లక్ష్మీదేవి మృతదేహం చెరువులో తేలియాడుతూ కనిపించింది. స్థానికుల సహకారంతో మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. సంఘటన స్థలాన్ని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నలుగురికి పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతి


కడప రీజనల్ డైరెక్టర్ డా.వై. శ్రీనివాసులును కలిసిన ఎంపీహెచ్‌ఈవోలు

కర్నూలు(హస్పిటల్), ఆగస్టు 31: కడప జోన్-4 పరిధిలో హెల్త్ సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలకు పదోన్నతులు కౌన్సెలింగ్ వైద్య ఆరోగ్యశాఖ రిజనల్ డైరెక్టర్ (కడప) కార్యాలయంలో శనివారం ముగిసింది. నలుగురు సూపర్ వైజర్లుకు పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతుల కౌన్సెలింగ్‌ను కడప ఆర్‌డీ డా.వై. శ్రీనివాసులు నిర్వహించారు. 18 మంది హెల్త్ అసిస్టెంట్లకు హెల్త్ సూపర్‌వైజర్లు పదోన్నతుల కౌన్సిలింగ్‌ను ఆర్‌డీ నిర్వహించారు. ఈ మేరకు కౌన్సెలింగ్ ప్రశాం తంగా నిర్వహించినందుకు కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎంపీహెచ్‌ఈవో కె.నరసప్ప, హనుమంతు కడప ఆర్‌డీని కలిసి అభినందనలు తెలిపారు.సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, శారద, భాగ్యమ్మ, కొత్తురమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

బైకును ఢీకొన్న లారీ


జయకుమార్ (ఫైల్)


డేవిడ్ పాల్ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు, 31: వెల్దుర్తి మండలంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ద్విచక్ర వాహనదారులు డేవిడ్ పాల్ (52), పాలెం జయకుమార్ (49) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. నంద్యాల జిల్లా డోన్ టీచర్స్ కాలనీకి చెందిన జయకుమార్ ప్రైవేటు సర్వేయర్, డేవిడ్‌పాల్ సహాయకుడు. వీరిరువురు తమ పనులు ముగించుకొని ఏపీ39 జీఈ 9306 నెంబరు గల ద్విచక్ర వాహనంపై డోన్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో వెల్దుర్తి మండలం మదార్‌పురం గ్రామం దాటిన తరువాత జాతీయ రహదారి-44లో నూతనంగా నిర్మించిన హిందూస్తాన్ పెట్రోల్ బంకు వద్ద వెనుక వైపు నుండి ఆర్‌జే11 జీసీ 4981 నెంబరు గల లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. ఈ ఘటనలో లారీ 100 మీటర్లు బైకును ఈడ్చుకొని వెళ్ళడంతో డేవిడ్ పాల్ తల వేరయి, శరీరం ఛిద్రమయింది. లారీ డ్రైవర్, క్లీనర్ వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు అక్కడ కు చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. వెల్దుర్తి పోలీసులు గ్రామ పంచాయతీ కార్మికులచేత మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డేవిడ్‌పాల్‌కు పెళ్లి కాలేదు. జయకుమార్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెగ్యులర్ అధ్యాపకుల కొరత



ప్రభుత్వ మైనారిటీ జూనియర్ కళాశాల

- పదవీ విరమణతో ఖాళీ అవుతున్న పోస్టులు
- కాంట్రాక్ట్ అధ్యాపకులతోనే బోధన
- నాగులదిన్నె, కర్నూలు మైనారిటీ కళాశాలలకు మంజూరుకాని పోస్టులు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దుస్థితి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 31: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఈ పోస్టుల భర్తీలో తీవ్ర కాలయాపన జరుగుతోంది. దీని వల్ల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. కాంట్రాక్ట్ అధ్యాపకులతోనే చదువు చెప్పిస్తున్నారు. విధిలేక పేద కుటుంబాల పిల్లలు కూడా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో చేరవలసి వస్తున్నది. గత 15 సంవత్సరాల నుంచి కొత్త రిక్రూట్‌మెంట్ లేక పోగా, ఉన్న అధ్యాపకులు పదవీ విరమణ వల్ల 60 శాతం పైగా కళాశాలలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కర్నూలు జిల్లాలో 23 కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7 వేలు మంది చదువుతున్నారు. ఈ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం వల్ల నాణ్యమైన విద్య అందడం లేదు. దీనితో అనేక ఆర్థిక ఇబ్బందుల మధ్యనే కార్పొరేట్ కళాశాలల్లో చేరుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కొద్ది కాలానికి ప్రభుత్వ కళాశాలలు మూతపడే పరిస్థితి వస్తుంది.

మొత్తం మంజూరు పోస్టులు 356

కర్నూలు జిల్లాలోని 23 ప్రభుత్వ కళాశాలలో మొత్తం 356 పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం రెగ్యులర్ పోస్టులు 156, కాగా కాంట్రాక్ట్ అధ్యాపకులు 171 మంది, ఇతరులు 29 మంది మాత్రమే పనిచేస్తున్నారు. పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టడం లేదు. కాంట్రాక్ట, గెస్ట్ అధ్యాపకుల చేతనే విద్యార్థులకు బోధన కొనసాగుతోంది. రెగ్యులర్ అధ్యాపకులను నియమించడంలో తీవ్ర అలసత్వం కొనసాగుతున్నది. ప్రస్తుతం అందరి దృష్టి ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్, ఫార్మసీ వంటి కోర్సులపై మళ్లింది. ఈ కోర్సులకు వెళ్ళాంటే మంచి మార్కులు రావాలి. ఇంటర్‌లో నాణ్యమైన విద్య ఉంటేనే ఇదంతా సాధ్యం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్య గ్యారెంటీ కాదు. గత 5 సంవత్సరాల క్రితం నాగులదిన్నె, కర్నూలు ప్రభుత్వ మైనారిటీ జూనియర్ కళాశాలలు మంజూరయాయ్యయి. వీటికి ఒక రెగ్యులర్ పోస్టు కూడా మంజూరు కాకపోవడంతో ఒక సీనియర్ అధ్యాపకుడ్ని ప్రిన్సిపాల్‌గా నియమించి, తాత్కాలిక అధ్యాపకులతో సరిపెట్టుకున్నారు. ప్రభుత్వం ఈ దుస్థితి నుంచి ప్రభుత్వ కళాశాలలను బైట పడేయడానికి చిత్తశుద్ధితో పని చేయడం లేదనే విమర్శ ఉంది.

అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు...



ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఇంకా కొరత ఉంటే, గెస్టు అధ్యాపకులను గంటల ప్రాతిపదికపై నియమించడానికి ప్రయత్నిస్తున్నాం. అధ్యాపకులను నియమించి మంచి విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

పరమేశ్వర రెడ్డి, డీవీఈవో, కర్నూలు

ఒకే గదిలో పలు తరగతులు


ఇరుకు గదిలో నేలపై చదువుకుంటున్న విద్యార్థులు

- 8 తరగతులకు మూడు చిన్న గదులు
- అవీ కాంక్రీట్ నిర్మాణం కాదు..షెడ్లు మాత్రమే
- మరుగుదొడ్లు నిల్
- ప్రాథమిక పాఠశాలలో ఒక టాయిలెట్ మాత్రమే



కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 31: నగర పాలక పరిధిలోని స్టాంటన్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తరగతి గదుల కొరత వేధిస్తోంది. ఒకే గదిలో 2, 3 తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం భవనం, హై స్కూల్ నిర్వహణ కొనసాగుతుంది. ఈ మూడు విద్యాసంస్థలకు కలిపి ఒకే మరుగుదొడ్డి ఉంది. దాన్ని వినియోగించుకోవాలంటే గంటల తరబడి వేచి ఉండాలి. ముఖ్యంగా బాలికల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. సకాలంలో యూరిన్‌కు వెళ్లలేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. వర్షం వస్తే.. విద్యార్థులకు ఆ రోజు పాఠశాలకు సెలవే. గత పది సంవత్సరాల కింద ఈ పాఠశాల గదుల నిర్మాణం కోసం గని గుంతల్లో స్థలం కేటాయించారు. ప్రభుత్వం గదుల నిర్మాణానికి రూ.1.30 కోట్లు కేటాయించారు. ఈ గదుల నిర్మాణానికి స్థలం అనువుగా లేకపోవడంతో నిర్మాణం చేపట్టలేకపోయారు. హై స్కూల్‌లో మూడు గదులు ఉన్నాయి. టాపు పైన షెడ్డును నిర్మించారు. హైస్కూల్ విద్యార్థులు మొత్తం 286 మంది విద్యార్థులు 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ఈ విద్యార్థులకు కనీసం 8 గదులు అవసరం. అలాగే ప్రాథమిక పాఠశాలలో 69 మంది, అంగన్‌వాడీ కేంద్రంలో 29 మంది చిన్నారులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద రూ. వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ కనీసం మౌలిక వసతులు కల్పించలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వమైనా చర్యలు తీసుకుని స్థలం కేటాయించి తరగతుల గదుల నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పశువుల పాక దగ్ధం

శిరివెళ్ల, ఆగస్టు 31 : మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన శంకరయ్య అనే వ్యక్తికి చెందిన పశువులపాకలో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పశువులపాకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి పాకలోని రెండు ఎద్దులు, నాలుగు పాడి గేదెలు, పది మేకలు అక్కడికక్కడే అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో దాదాపు రూ.7 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. పశువులే జీవనాధారంగా బతుకున్న తమకు ప్రభుత్వం సాయం అందించాలని బాధితుడు శంకరయ్య కన్నీటిపర్యంతమయ్యాడు.

సీమ సాగునీటికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి



- అమరావతి, పోలవరంలాగే సీమకు ప్రత్యేక నిధులు రాబట్టాలి
- సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి
- సీఎం చంద్రబాబుకు లేఖ

నంద్యాల టౌన్, ఆగస్టు 31 : రాయలసీమ సాగు నీటి రంగాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఈ మేరకు సీఎంకు ఒక లేఖను ఈ మెయిల్ ద్వారా పంపిచారు. దీన్ని పత్రికా సమావే శంలో విడుదల చేస్తూ ఏపీ ఖజానాపై ఆర్థిక భారం పడకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించి కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించారని అన్నారు. తద్వారా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధుల కేటాయించినట్లే రాయలసీమ సమగ్ర సాగునీటి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. అమరావతికి, పోలవరానికి కేంద్రం నుంచి నిధులు సాధించిన తరహాలోనే రాయలసీమ ప్రాజెక్టులకు కూడా నిధులు సాధించి గాడిన పెడతారని సీమ ప్రజలు ఆశతో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో 42 శాతం రాయలసీమ జిల్లాల్లో ఉన్నప్పటికీ రాష్ట్ర సాగునీటి బడ్జెట్‌లో కేవలం 15 శాతం నిధులే గత 10 సంవత్సరాలుగా ఖర్చు చేస్తున్నారని అన్నారు. దీని వల్ల ఈ ప్రాంతంలో ప్రాజెక్టుల పురోగతికి ఆటంకం కలిగిందని అన్నారు. నిర్మించిన ప్రాజెక్టుల నిర్వహణకు కూడా నోచుకోక పోవడంతో సాగునీటి ఆధారంగా రాయలసీమలో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు.సాగునీటి బడ్జెట్‌లో 42 శాతం నిధులు రాయలసీమకు కేటాయించాలని సీఎంను కోరారు. విభజన చట్టంలో పొందుపరిచిన వెనుకబడిన జిల్లాల బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ నిధులను కేంద్రం నుంచి తక్షణమే సాధించాలన్నారు. రాయలసీమలోని చెరువుల పరిరక్షణ, నిర్మాణం, వాగులు, వంకలు, నదులు, కాల్వలతో అనుసంధానం, పెన్నా నది పునరుజ్జీవం, సామాజిక అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మొదలైనవి ఒక నిర్దిష్ట ప్రణాళికతో చేపట్టాలని కోరారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ


దొంగలు పగలగొట్టిన హుండీ

పత్తికొండ, ఆగస్టు 31: పత్తికొండ పట్టణం ఆదోని రహదారిలో నాయిబ్రాహ్మణవీధి సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయానికి వేసి ఉన్న తాళాన్ని పగలగొట్టిన దొంగలు ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. సుమారు 300 కిలోల బరువు ఉన్న హుండీని ఆటోలో నిర్మానుష్య ప్రాంతానికి తీసికెళ్లి పగలగొట్టి అందులో ఉన్న సొమ్ము తీసుకున్నారు. స్వామికి సంబంధించి 18 తులాల వెండి నగలతోపాటు భక్తులు వేసిన కానుకలు హుండీలో ఉన్నాయని పూజారి తెలిపారు. సీఐ జయన్న సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నలుగురు దొంగలు చోరీలో పాల్గొన్నట్లు అంచనాకు వచ్చారు.

జై హనుమా..!

ఘనంగా రణమండల ఆంజనేయ రథోత్సవం


పురవీధులలో ఊరేగుతున్న ఆంజనేయుడి రథం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 31: ఆదోని పట్టణ శివారు ప్రాంతంలోని రణమండల ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం కన్నులపండువగా సాగింది. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో కొండపై నుంచి రణమండల అంజనేయ విగ్రహాన్ని స్థానిక సాయిబాబా మందిరం వద్దకు తీసుకువచ్చి రథోత్సవంలో ఊరేగించారు. 40 రోజులపాటు రణమండల ఆంజనేయుడికి ప్రతిరోజు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం సింధూర సేవ, ఆకుపూజ, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. చివరివారం కావడంతో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని సాయిబాబా మందిరం నుంచి మున్సిపల్ మెయిన్ రోడ్ శ్రీనివాస భవన్ నుంచి ఊరేగింపు చేపట్టారు. ఈ ఊరేగింపులో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, చైర్‌పర్సన్ శాంత, విట్టా రమేష్, ఆలయ కమిటీ సభ్యులు టీజీ పాండురంగ తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు


రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఘనంగా గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



గౌరు వెంకటరెడ్డి దంపతులకు గజమాలతో సన్మానం

ఓర్వకల్లు, ఆగస్టు 31: నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. గౌరు వెంకటరెడ్డి, ఆయన సతీమణి, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో పాటు నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌కు హుశేనాపురం గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి గౌరు వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన నాయకులు చంద్రపెద్దస్వామి, సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీరాములు, ఆకుల మహేష్, విశ్వేశ్వరరెడ్డి, కాకి దేవేంద్ర, రామమద్దిలేటి, మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు గౌరు వెంకటరెడ్డికి పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విజేతలుగా తిరిగి రావాలి

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 31: రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగి రావాలని జిల్లా రోయింగ్ సంఘం అధ్యక్షుడు డా. అరవింద్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా ఫ్లోర్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.అరవింద్ రెడ్డి మాట్లాడుతూ బాపట్ల జిల్లా నరసరావుపేటలో సెప్టెంబరు 1, 2 తేదీల్లో జరిగే 18వ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి సునీల్ కుమార్, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి ఎం.అవినాశ్ శెట్టి, జిల్లా రోయింగ్ సభ్యులు రాజేంద్ర, జిల్లా ఫ్లోర్‌బాల్ సంఘం కార్యదర్శి బి.ఈశ్వర్ నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు మాదవి, వెంకటలక్ష్మి, లావణ్య, శేషు, మనోహర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



రోడ్లపై నిలిచి ఉన్న నీటిని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 31: నగర పాలక సంస్థ పరిధిలో నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని అశోక్‌నగర్, వెంకటరమణ కాలనీ, ఇందిరాగాంధీ నగర్ ప్రాంతాల్లో పర్యటించి రోడ్లపై నిలిచి ఉన్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ అశోక్‌నగర్ పంప్‌హౌస్‌లో వ్యాపార సముదాయం నిర్మించిన కాంట్రాక్టర్ టన్నుల కొద్ది మట్టిని మురికి కాలువలో, ఫుట్‌పాత్‌పై వదిలేశారని అన్నారు. ఇంత బాధ్యతరహితంగా వ్యవహరించే కాంట్రాక్టర్ల బిల్లులపై మున్సిపల్ ఇంజనీర్లు కళ్లు మూసుకుని సంతకాలు పెడుతున్నారా అని ప్రశ్నించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టబోయే కమిషనర్ రవీంద్రబాబు జోక్యం చేసుకుని కాంట్రాక్టర్లు, ఇంజనీర్లపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కే శ్రీనివాసులు, టి. పురుషోత్తంరెడ్డి, ఎం.నాగరా జు, టి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పరిశ్రమ ఏర్పాటు మానుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 31: ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటును ఇకనైనా మానుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం, ఓర్వకల్లు మండల కార్యదర్శి ఆవుల శేఖర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రీన్ కో ఎనర్జీ సంస్థ పూర్తిగా ప్రైవేటు సంస్థ అన్నారు. అలాంటి సంస్థకు ప్రభుత్వం వేల ఎకరాలను సేకరించి ఇచ్చేందుకు ప్రయత్నాలు చేయడం దారుణమని అన్నారు. పేద, మధ్యతరగతి, సన్న, చిన్నకారు రైతుల పొలాలు తక్కువ రేటుకు తీసుకుని ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు అప్పగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. రైతులంతా గ్రామ గ్రామాన సమీకృతమై రాబోయే రోజుల్లో పెద్ద పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 31: ఉద్యోగ జీవితంలో బదిలీలు, పదోన్నతులు, విరమణలు సహజమని, వారు చేసిన సేవలే చిరకాలం గుర్తు ఉండిపోతాయని విజయవాడ జాయింట్ చీఫ్ పర్యావరణ ఇంజనీరు పి. ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక ప్రయివేటు భవనంలో కాలుష్య నియంత్రణ మండలి కర్నూలు జేసీఈఈ ఎంవీఎస్ ప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరయిన ప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగులతో సత్సంబంధాలు నెరుపుతూ వారి సమస్యలతోపాటు సంక్షేమం, సంస్థ అభ్యున్నతికి కృషి చేసిన వారు సేవలు చిరస్మరణీయమన్నారు. ఎంవీఎస్ ప్రసాద్‌ను సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించి అభినందించారు.

'గౌరు ఆయురారోగ్యాలతో జీవించాలి'



గౌరు వెంకటరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

కల్లూరు, ఆగస్టు 31: నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాధవీనగర్‌లోని నివాసంలో గౌరు దంపతులు భారీకేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్.మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో భారీ గజమాలతో గౌరు దంపతులను సత్కరించారు. పాణ్యం, నందికొట్కూరు మండలాల నుంచి టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఉలిందకొండ టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ రమణ, దొడ్డిపాడు బాషా ఆధ్వర్యంలో వృద్ధులు, అనాథలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పెద్దపాడు బీచుపల్లి, పరమేశ్వరరెడ్డి, శేఖర్ పందిపాడు దేవేంద్రారెడ్డి, శేఖర్‌చౌదరి ఆధ్వర్యంలో వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డి.రామాంజనేయులు, తడకనపల్లె సర్పంచు సహరాబీ, వాకిటి మాదేష్ పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్. తిరుమలేశ్వర రెడ్డి తదితరులు





వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ, పత్తి పంటలు

రైతుల గుండెల్లో తుఫాన్ దడ

- దెబ్బతిన్న ఉల్లి, పత్తి, వేరుశనగ, సజ్జ, కొర్ర పంటలు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఆందోళన చెందుతున్న రైతులు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 31: మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల శుక్రవారం రాత్రి నుంచి జల్లులు పడుతున్నాయి. దీంతో పంటలు తడిసి ముద్దయ్యాయి. ఈ కారణంగా ఖరీఫ్ కింద సాగు చేసిన ఉల్లి, పత్తి, వేరుశనగ, సజ్జ, కొర్ర వంటి పంట దిగుబడులకు ఇబ్బంది ఏర్పడింది. దిగుబడులను కాపాడుకోవడానికి రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో పొలాల్లో పీకి ఉంచిన వేరుశనగ తడుస్తూ గ్రాసం పనికి రాకుండా పోయింది. కాయల నాణ్యత దెబ్బతింటోంది. కోత చేసిన ఉల్లి దిగుబడులను టార్పాలిన్ పట్టాలు కప్పి కాపాడుకుంటున్నారు. పత్తిలో కాయలు నల్లబారడం, దూది తడిసి గింజలు మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. సజ్జ, కొర్ర దిగుబడులకు ఇబ్బందిగా మారిందని అంటున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వెంటాడి నష్టాలు చవిచూశామని, ఇపుడు పంట దిగుబడులు అందుతున్న సమయంలో అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



వర్షానికి తడవకుండా కప్పిన టార్పాలిన్లు

పింఛన్‌దారుల ఆనందమే చంద్రబాబు లక్ష్యం



ఓర్వకల్లులో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



పింఛను పంపిణీ చేస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు



సి. బెళగల్‌లో పింఛను పంపిణీ చేస్తున్న అధికారులు

ఓర్వకల్లు, ఆగస్టు 31: పింఛన్‌దారుల్లో ఆనందం నింపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి శనివారం ఓర్వకల్లుకు రావాల్సిన సీఎం చంద్రబాబు అనివార్య కారణాల వల్ల రాలేకపోయారు. దీంతో ఓర్వకల్లులో పింఛన్‌దారులైన షేక్ షోకరాబీ, రమణమ్మ, రాజులకు వారి ఇళ్లకు వెళ్లి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, సెర్ప్ సీఈవో వీరపాండియన్, కలెక్టర్ పి.రంజిత్ బాషా, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1వ తేదీకి ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేశామన్నారు. ఉదయం 6 గంటలకే అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో శివనాగప్రసాద్, డీఎల్‌పీవో తిమ్మక్క, నాయకులు రామభూపాల్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, అబ్దుల్లా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

● **కర్నూలు(రూరల్):** పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో శనివారం సర్పంచు మాధవస్వామి అధ్యక్షతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు అందజేశారు. 98శాతం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పంచలింగాలలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అనురాధ, పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, ఏవో రామకృష్ణ, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, సుబ్బయ్య, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

● **కర్నూలు(అర్బన్):** మాట మీద నిలబడే నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా 25వ వార్డులోని బీ క్యాంప్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నగర అధ్య క్షుడు నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

● **గూడూరు:** మండలంలోని ఆర్ ఖానాపురం గ్రామంలో ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, సర్పంచ్ మునిస్వామి, సుంకిరెడ్డి పాల్గొన్నారు.

● **కర్నూలు(న్యూసిటీ):** నగర పాలక సంస్థ పరిధిలో శనివారం 96.78 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. నగరంలో 35,744 మంది పింఛనుదారులు ఉండగా ఒక్క రోజులోనే 34,594 మందికి ఇంటి వద్దే పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ జరుగుతుందని చెప్పారు.

కల్లూరు: మండలంలో 97.54 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 6,067 మంది పింఛనుదారులు ఉండగా సాయంత్రం 6 గంటలకు 5,918 మందికి పింఛన్లు అందించామని అన్నారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సంక్షేమమని నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 41వ వార్డులో ఆమె పింఛన్లు పంపిణీ చేశారు.

సి. బెళగల్: మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో రాముడు తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రక్తనాళాల సమస్యకు అధునాతన చికిత్స

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 31: రక్తనాళాల్లో ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరించే విషయంలో అధునాతన వైద్యవిధానాలు అందుబాటులోకి వచ్చాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూ ఆడిటోరియంలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ డా.మంజులాబాయి ఆధ్వర్యంలో వ్యాసకులర్ అనామలిస్‌పై జోనల్ సీఎంఈని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ రిటైర్డు ప్రొఫెసర్ డా.సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్, గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్లు డా.జీవీ సుధాకర్, డా.పల్కూరి లక్ష్మి, కర్నూలు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు డా.రాజా రవికుమార్, డా.సింధుప్రియాంక, డా.అరుణ, డా.రూపశ్రీ, డా.గంగా భవాని, డా.రవీంద్రారెడ్డి, డా.విజయ చంద్రమౌళి పాల్గొన్నారు.

11.2 మి.మీ. వర్ష పాతం నమోదు

గూడూరు, ఆగస్టు 31: మండలంలో 11.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పంట పొలాలకు ఊపిరి పోసినట్టయిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చాగలమర్రి, ఆగస్టు 31: చాగలమర్రిలోని పాతబస్టాండు వీధికి చెందిన టీడీపీ నాయకుడు గడేకారి మహమ్మద్ కుమారుడు సిద్దిక్ (25) శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సిద్ధిక్ తన స్నేహితుడు చౌహిత్‌తో కలిసి ప్రొద్దుటూరుకు వెళ్లి రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంలో తిరిగి చాగలమర్రికి వస్తుండగా దువ్వూరు మండలం పెద్దజొన్నవరం సమీపంలో లారీ ఢీకొన్న ఘటనలో సిద్ధిక్ అక్కడికక్కడే మృతి చెందగా చౌహిత్ గాయపడ్డాడు. చౌహిత్‌ను చికిత్స నిమిత్తం, సిద్దిక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు. దువ్వూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, షరీఫ్, మౌళాలి, అనిఫ్, ఖలీల్‌తో పాటు పలువురు సంతాపం ప్రకటించి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు గడేకారి మహమ్మద్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపి అండగా ఉంటామని అన్నారు.

భారీ వర్షాలపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 31: రానున్న రెండు, మూడు రోజుల్లో జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ తదితర అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. వీఆర్వోలు, పంచాయితీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఉండి పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూములు 24 గంటలు పని చేసేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిపై నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హెడ్ నర్సు మేరీ కళావతికి సన్మానం

కర్నూలు (హాస్పిటల్), ఆగస్టు 31: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పదవీ విరమణ పొందిన సీనియర్ హెడ్ నర్సు ఏ.మేరీ కళావతిని నర్సింగ్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆసుపత్రిలో ఓల్డ్ సీఎల్‌జీలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ అనుసూయ, హెడ్ నర్సులు పి.లీలారాణి, లీలమ్మ, ఎన్.లక్ష్మీదేవి, ఈ.కళావతి, ఆదిలక్ష్మి, శ్యామల, స్టాఫ్ నర్సులు మంజుల, బద్రి విజయమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.



హెడ్ నర్సును సన్మానిస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్

సీజీహెచ్‌ఎస్ ఏర్పాటు చేయాలి



సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న క్రిష్టియన్ సెల్ నాయకుడు బాబురాజు

కర్నూలు (అర్బన్), ఆగస్టు 31: కర్నూలులో సెంట్రల్ గౌర్నమెంట్ ఉద్యోగులకు సీజీహెచ్‌ఎస్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ వైస్ ఉపాధ్యక్షుడు ఏవైఎన్ బాబురాజు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఓ వినతి పత్రం ద్వారా కోరారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సంబంధించిన సీజీహెచ్ ఆస్పత్రి ప్రస్తు తం నెల్లూరు జిల్లాలో ఉండటం వల్ల వైద్య సేవలకు అక్కడికి వెళ్లాల్సి వస్తోం దని అన్నారు. ఉద్యోగులు ఇబ్బందులు లేకుండా కర్నూలులో డిస్పెన్సరీ ఏర్పాటు చేసి ఓ వైద్యుడిని నియమించాలని కోరారు.

పంట నమోదును పూర్తి చేయండి: జేడీఏ



ఓర్వకల్లులో కొర్ర పంటను పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మి

ఓర్వకల్లు, ఆగస్టు 31: ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ జేడీఏ వరలక్ష్మి అన్నారు. శనివారం ఖరీఫ్‌లో వేసిన కొర్ర పంటను పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఇప్పటి వరకు 11,433 ఎకరాలు నమోదు చేశారన్నారు. తమ పంటలను సెప్టెంబరు 15వ తేదీలోపు ఈ-పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. దీంతో పాటు రైతులు ఈకేవైసీని కూడా రైతుసేవా కేంద్రాల్లో సిబ్బందితో చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, ప్రకృతి వ్యవసాయాదికారి దస్తగిరిరెడ్డి, ఏవో సుధాకర్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాపును జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు శ్రీనివాసులు

ఓర్వకల్లు, ఆగస్టు 31: సెప్టెంబరు 3, 4, 5 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి బీసన్న పిలుపునిచ్చారు. శనివారం ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని అన్నారు. పాలకులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. కార్యక్రమంలో చంటి, సుధాకర్, మహబూబ్ వలి, జయన్న, బాలమద్దిలేటి పాల్గొన్నారు.

మిరప, ఉల్లి పంటల పరిశీలన



మిరప తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

సి.బెళగల్, ఆగస్టు 31: మిరప, ఉల్లి పంటలను కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు, ఏవోలు మల్లేష్‌కుమార్, హార్టికల్చర్ అసిస్టెంటు చెంచురాజు పరిశీలించారు. శనివారం మండలంలోని మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, పోలకల్లు గ్రామాల్లో పర్యటించారు. రైతులు సాగు చేసిన మిరప, ఉల్లి, పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు మాట్లాడారు. కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి రోజూ పంటలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. పొలం గట్ల చుట్టూ మీటరు లోతు గుంత తవ్వితే నీరు ఇంకిపోతుందని తెలిపారు. ప్రతి ఈ పద్ధతిని పాటించాలని సూచించారు.

వర్షాల నుంచి జాగ్రత్తలు తీసుకోండి

కోడుమూరు (రూరల్), ఆగస్టు 31: మండలంలో కురుస్తున్న వర్షాల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ ప్రజలను హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ ఒక ప్రకటనలో సూచిస్తూ వర్షపు నీటి ప్రవాహం ఉన్న ఎడల వాగులు, వంకలు దాటకూడదని అన్నారు. మట్టి మిద్దెలు కూలే ప్రమాదం ఉండవచ్చని, సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలని సూచించారు. అలాగే విద్యుత్ పరికరాలతో జాగ్రత్త వహించా లని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న రామాంజనేయులు

కల్లూరు, ఆగస్టు 31: నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని కల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. శనివారం బొల్లవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాణ్యం ఐటీడీపీ అధ్యక్షుడు రమణ, విజయ్, మస్తాన్ నాయుడు, ఎస్ఎంసీ చైర్మన్ డి.మస్తాన్‌నాయుడు, లక్ష్మన్న పాల్గొన్నారు.

గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

కల్లూరు, ఆగస్టు 31: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌లో గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) అర్బన్ అధ్యక్షుడు మోటా సురేష్ అన్నారు. శనివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను కలిసి గిరిజన యువతీ, యువకుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 31: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి నాగార్జున అన్నారు. ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో స్థానిక ఐదు రోడ్ల కూడలి జంక్షన్‌లో విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. కార్యక్రమంలో ఐసా నగర కార్యదర్శి పెద్దయ్య, కిరణ్ పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

అధిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, ఆగస్టు 31: అధిక వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో రవి సూచించారు. శనివారం పెరవలి గ్రామంలో వేరుశనగను పరిశీలించారు. ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు 19195 రకం ఎరువులు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈక్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

రైతులకు అందుబాటులో ఉండాలని మాజీ జడ్పీటీసీ పి. పురుషోత్తం కోరారు. శనివారం పెరవలిలో ఏవో రవి, వ్యవసాయ సిబ్బంది కలిశారు. అధిక వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయని, క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికలు ఇవ్వాలన్నారు. రైతులు అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా వారికి సూచనలు ఇవ్వాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

మద్దికెర, ఆగస్టు 31: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జిల్లా టీడీపీ కార్యనిర్వహణాధికారి కటారుకొండ శ్రీనివాసులు, తెలుగుయువత నాయకులు మొలగవెల్లి విశ్వనాథ్, న్యాయవాది ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మద్దికెరలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరంతరం పేదల కోసం పని చేస్తుందన్నారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ముందే పింఛన్లు పంపిణీ చేశామని అన్నారు. అన్నా క్యాంటీన్లు, పేదల ఆకలి తీరుస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లు తీసేసి నిరుపేదల కడుపు కొట్టారన్నారు.

చంద్రబాబు కోసం కేఈ శ్యాంబాబు పూజలు

పత్తికొండ, ఆగస్టు 31: చంద్రబాబు సీఎం అయి 30 ఏళ్లు అయినందుకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు శనివారం పత్తికొండ పెద్దాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు విజన్‌కలిగిన నాయకుడుగా నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. ఎమ్మెల్యేగా పనిచేయడం గర్వంగా ఉందన్నారు. లీగల్‌సెల్ నాయకులు సురేష్‌కుమార్, చక్కాగోపాల్, లోక్‌నాథ్ ఉన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

తుగ్గలి, ఆగస్టు 31: ఖరీఫ్ పంటలను ఈక్రాప్‌లో తప్పక నమోదు చేసుకోవాలని ఏవో పవన్ కుమార్ సూచించారు. శనివారం తుగ్గలి, గ్రామాల్లో ఈక్రాప్ నమోదును చేపట్టారు.

పూర్వ విద్యార్థుల సహకారం

పత్తికొండ టౌన్, ఆగస్టు 31: పత్తికొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు విద్యుత్ బెల్‌ను శనివారం అందజేశారు. 2005 పదో తరగతి పూర్వ విద్యార్థులు తులసీధర్ రెడ్డి, లక్ష్మన్న, నాగరాజు, ఉపాధ్యాయులు ఉస్మాన్‌బాషా, పీఈటీలు రాజేష్, రజియా పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత



నగదు అందచేస్తున్న ప్రిన్సిపాల్

ఆలూరు రూరల్, ఆగస్టు 31: అరికెర అంబేద్కర్ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి చంద్రశేఖర్ తండ్రి సిద్ధప్ప మృతిచెందాడు. దీంతో సహచర విద్యార్థులు రూ.5,500 శనివారం ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి ద్వారా అందించారు. ఉపాధ్యాయులు నరసింహులు సాయం చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే సేవాభావం అలవర్చుకొని సాయం చేయడం అభినందనీయమని అన్నారు.

జాతీయ పోషణ వారోత్సవాలు

హొళగుంద, ఆగస్టు 31: సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జాతీయ పోషణ వారోత్సవాలు కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీవో సహసమ్మ ఆస్పిరేషనల్ బ్లాక్ కో- ఆర్డినేటర్ రవిశంకర్ శనివారం తెలిపారు. అధికారులతో సమావేశం నిర్వహించారు. నీతి అయాగ్ సూచనల మేరకు మండలంలోని 49 అంగన్‌వాడీ కేంద్రాల్లో వారం పాటు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారి న్యూటన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు స్వర్ణామృత ఔషధ పంపిణీ



ఔషధాన్ని అందిస్తున్న సంస్థ సభ్యులు

ఆదోని టౌన్, ఆగస్టు 31 : రోగ నిరోధకశక్తి కోసం త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో తయారైన స్వర్ణామృత ఔషధాన్ని శనివారం ఆర్య వైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) పంపిణీ చేసారు. అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ, 389 మంది చిన్నారులకు పంపిణీ చేశామని సౌజన్యకర్తగా కాకుబాల్ నగేష్ వ్యవహరించారని అన్నారు. రఘు, ఈరన్న శెట్టి, వెంకటేశ్వరులు, మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమత శ్రీ, సంగీత, హిమబిందు, గీత, శ్రీదేవి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం..కేసు నమోదు

పెద్దకడుబూరు, ఆగస్టు 31: మండల కేంద్రంలో వివాహిత అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వివరాల మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన అరుణ (20) ఈ నెల 28వ తేదీ నుంచి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంటి రంగస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 31: పట్టణంలోని వెంకటాపురం గుంటి రంగస్వామి రథోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను ఉంచి రథోత్సవం నిర్వహించారు.

పాత్రికేయుడిమృతి

గోనెగండ్ల ఆగస్టు 31: మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు వడ్ల రంగస్వామి(80) శనివారం ఉదయం మృతి చెందాడు. 20 ఏళ్లు ఓ దినపత్రికలో విలేకరిగా పని చేశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, టీడీపీ కన్వీనర్, నజీర్‌సాహెబ్, తిరుపతయ్య నాయుడు మాజీ సర్పంచ్ రహంతుల్లా నివాళి అర్పించారు.

అక్రమమా.. సక్రమమా?



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారధి



అధికారితో కౌన్సిలర్ల వాగ్వావాదం

అనుమతి పొందకుండా ఎలా నిర్మించారని ప్రశ్నించిన ఎమ్మెల్యే

ఆదోని మున్సిపల్ సమావేశం రసాభాస

ఫ్లెక్సీలను తొలగించాలని వైసీపీ కౌన్సిలర్ల బైఠాయింపు

ఆదోని టౌన్, ఆగస్టు 31: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం అక్రమమా, సక్రమమా? తేల్చాలని ఎమ్మెల్యే డా. పార్థసారథి అన్నారు. శనివారం చైర్‌పర్సన్ వాల్మీకి శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండా అంశాలు చదవడం అయ్యాక ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వైసీపీ కార్యాలయ భవనం ముమ్మాటికీ అక్రమ కట్టడమే అని, ఫ్లెక్సీలో చేసిన ఆరోపణలకు తాను కట్టుబడి ఉన్నానని అన్నారు. ప్లాన్ అనుమతి మంజూరు కాకుండానే మూడు అంతస్థుల భవనాన్ని ఎలా నిర్మించారని ప్రశ్నించారు. ఎర్రి స్వామి అనే వ్యక్తిదైతే ఇసీలో ఆయన పేరు ఎందుకు లేదని నిలదీశారు. వాడి వేడిగా చర్చ జరుగుతుండగానే ఫ్లెక్సీలను తొలగించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ మహిళా కౌన్సిలరులు బైఠాయించారు. వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలరులు సందీప్, రఘు, పయాజ్ ఫ్లెక్సీలను వ్యతిరేకించారు. టౌన్ ప్లానింగ్ అధికారితో కౌన్సిలర్లు వాగ్వాదం చేశారు.

కొద్దిసేపటికి వైసీపీ మహిళా కౌన్సిలర్లు వెళ్లిపోగా, ఆ పార్టీ ఎమ్మెల్సీ మధుసూదన్ కూడా ఏమి మాట్లాడకుండా బయటికి వెళ్లిపోయారు. ఇన్‌చార్జి కమిషనర్ అనుపమ, ఎంఈ ఇంటియాజ్ అలీ, డీఈలు వెంకట చలపతి, గోపీనాథ్, ఏఈ రాజశేఖర్ రెడ్డి ఏసీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తడిసిన పంట దిగుబడులు తేవద్దు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 31: వర్షానికి తడిసిన దిగుబడులను రైతులు విక్రయానికి తీసుకురావద్దని మార్కెట్ యార్డ్ కమిటీ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి కోరారు. శనివారం మాట్లాడుతూ మూడు రోజులుగా వేరుశనగ, పత్తి ఇతర ఉత్పత్తులను ఆరబెట్టకుండా తెస్తుండంతో ధర రావడం లేదని అన్నారు. సోమవారం అమావాస్య మార్కెట్ కమిటీకి సెలవు ఉంటుందని ఆరోజు క్రయవిక్రయాలు జరగవని తెలిపారు.

3న జాబ్ మేళా

ఆలూరు, ఆగస్టు 31: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి శనివారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పిజీ చదివి, 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల్లోపు ఉండాలని వివరాలకు 9010003132ను సంప్రదించలన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కోసిగి: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబరు 2న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జనసేన ఇన్‌చార్జి వాల్మీకి లక్ష్మన్న, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెపాడు ముత్తురెడ్డి, కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీలు తోవి రామకృష్ణ, వెంకటేశ్ అన్నారు. వీరారెడ్డి, కరీం, శివ, కాంతు, వీర, రాము, కరెయ్య ఉన్నారు. అనంతరం కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్‌ను కలిశారు.

వద్దన్నా వాన

- నీట మునిగిన పొలాలు

- ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



కోసిగి: చింతకుంటలో నీట మునిగిన మిరపను చూపుతున్న రైతు నాగరాజు




గోనెగండ్ల: వేముగోడులో నీటమునిగిన పత్తి

ఎమ్మిగనూరురూరల్, ఆగస్టు 31: ఎమ్మిగనూరు, ఆస్పరి, కోసిగి మండలాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఎమ్మిగనూరు మండలంలో 34.8 మి.మీ.ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. వేరుశనగ, పత్తి, మిరప, పంట పొలాలలో నీరు చేరడంతో పంటలు దెబ్బతిన్నాయని, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోసిగి: మండలంలోని చింతకుంట గ్రామంలో పంటలు నీట మునిగాయి. మాన్వి నాగరాజు మిరప నీట మునిగింది. దేవరబెట్ట గ్రామానికి వెళ్లే కల్వర్టు రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వారం క్రితం టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి సొంత నిధులతో కల్వర్టు రోడ్డు పనులు చేసినా వరద తాకిడికి కొట్టుకుపోయింది.

ఆస్పరి: మండలంలోని చిరుమాను దొడ్డి గ్రామంలో టమోటా నీట మునిగింది.. సుమారు 2వేల ఎకరాల్లో టమోటా సాగు చేశారు. టమోటా రైతులు పెట్టిన పెట్టుబడులు మట్టి పాలయ్యాయి.

హొళగుంద: మండలంలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఈ రోడ్లన్నీ బురదమయమయ్యాయి. ప్రజాప్రతినిదులు చొరవ తీసుకుని మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెద్దకడబూరులో నేలవాలిన కొర్ర పంట

తుగ్గలి: జొన్నగిరి, చిన్న జొన్నగిరి మధ్య వంతెన కోసుకు పోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

పెద్దకడుబూరు: మండలంలో 38.2 మీ.మీ వర్షం కురిసింది. మిరప, పత్తి, వరి, కొర్ర నీట మునిగాయి.

గోనెగండ్ల: మండలంలోని గంజహళ్లి, గోనెగండ్ల, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, వేముగోడు, గాజులదిన్నె తదితర



తుగ్గలి: జొన్నగిరి కోసుకుపోయిన వంతెన

గ్రామాల్లో పరటలు నీట మునిగాయి. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 20వేల హెక్టార్లలో పత్తి, 6వేల హెక్టార్లలో ఉల్లి, 5వేల హెక్టార్లలో వేరుశనగ పంటలు సాగు చేశారు.

పంట నీటి పాలైంది.

1.5 ఎకరాల్లో టమోటా, 1.5ఎకరాల్లో పత్తి సాగుచేశా. టమోటా కుళ్లిపోతుండడంతో దిక్కు తోచడం లేదు పెట్టిన పెట్టుబడి నీళ్లపాలయ్యింది.

-పద్మావతి, మహిళా రైతు, చిరుమాన్ దొడ్డి, ఆస్పరి.



డివిజన్ కేంద్రంలో కంట్రోల్ రూమ్

- ఆదోని సబ్ కలెక్టర్ విశ్వనాథ్

ఆదోని, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సమస్యలుంటే 8333989012 నంబర్‌కు కాల్ చేయాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ విశ్వనాథ్ శనివారం తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు.. వాగులు, వంకల వద్ద ప్రజలు ప్రమాదాలకు గురికాంకుడా జాగ్రత్త వహించాలని ఆదేశించారు.

వైసీపీ చేతకాదనే టీడీపీని గెలిపించారు

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



బస్సును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న బీవీ

ఎమ్మిగనూరు, ఆగస్టు 31: వైసీపీ చేత కాదనే టీడీపీని గెలిపించారని ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సీఎం త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎమ్మిగనూరు డిపోకు మంజూరైన రెండు కొత్త బస్సులను ఆయన ప్రారంభించ కొంత దూరం కొత్తబస్సును ఎమ్మెల్యే నడపడిపారు. అనంతరం మాట్లాడుతూ డిపో సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. డీఎం అమర్‌నాథ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ మాదవరావు దేశాయ్, కౌన్సిలర్లు రామదాసు గౌడ్, దయాసాగర్, అమాన్, ఇసాక్, నాయకులు రంగస్వామి గౌడ్, బచ్చాల రంగన్న, గుల్లా సలాం, సలీం, తురేగల్ నజీర్, అల్తాఫ్, నవాజ్, కటారి రాజేంద్ర, రాజు, మాచాని శివకుమార్, సూరి, అబ్దుల్, రూరల్ సీఐ విక్రమ సింహా, ఎస్ఐ శ్రీనివా సులు, యునియన్ నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలోని 14వ వార్డులో బీవీ పింఛన్లను పంపిణీ చేశారు. తాము అధికారంలోకి వచ్చి 90రోజులు కూడా కాలేదని చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని హామీలను ఒక్కోటిగా అమలు చేస్తారన్నారు. స్థానికులు రోడ్లు, డ్రైనేజీలు, పారి శుధ్యం, తాగునీటి సమస్యలు, పట్టాలు, నూతన పెన్షన్లు ఇవ్వాలని మహిళలు కోరగా పరిష్కరి స్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్ రెడ్డి, వార్డు టీడీపీ ఇన్‌చార్జీ బందేనవాజ్, నాయకులు జయన్న, కామర్తి మహేష్, కటారి రాజేంద్ర, బచ్చాల రంగన్న, వీరేష్, సూరి పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు



రజిత గజవాహనంపై ఊరేగింపు

మంత్రాలయం, ఆగస్టు 31: మఠంలో ప్రహ్లదరాయులు రజిత గజవాహనంపై దర్శనమిచ్చారు. శ్రావణ మాసం ఆఖరి శనివారం ద్వాదశి వేడుకలను పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే మూల బృందా వనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్ కాంతుల మధ్య గజవాహనం ఊరేగుతుండగా భక్తుల జయధ్వనులతో ప్రాంగణం మార్మోగింది. పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

రాష్ట్రం కళకళలాడాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 31: పచ్చదనంతో రాష్ట్రమంతా కళకళలాడాలని జనసేన ఇన్‌చార్జి రాజశేఖర్ అన్నారు. పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఏపీ మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు రామనాయుడు, బీజేపీ కోకన్వీనర్ గోవర్ధన్ పాల్గొన్నారు. ఇస్మాయిల్, సుధాకర్, కార్తిక్, వీరేష్, అనిల్, టీడీపీ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో పత్తికొండలో కంట్రోల్‌రూం

పత్తికొండ, ఆగస్టు 31: వర్షాల నేపథ్యంలో పత్తికొండ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశా మని ఆర్డీవో రామలక్ష్మి శనివారం తెలిపారు. ఆర్డీవో కార్యాలయం-9010652595, ఆలూరు-9441544192, ఆస్పరి-9704390458, చిప్పగిరి-8121140364, ఎత్తికొండ - 9493818095, తుగ్గలి-9441933951, క్రిష్ణగిరి- 9182661898, మద్దికెర మండలం- 9440427576, దేవన కొండ-9177486648, హాలహర్వి- 9182918508లలో సంప్రదించాలని ఆర్డీవో కోరారు.

పండుగలా పింఛన్ల పంపిణీ



ఆదోని: పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు



పత్తికొండ: రామచ్రందాపురంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు..

ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం పరిధిలో జోరువానలోనూ అందజేత

ఆదోని, ఆగస్టు 31: ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లో శనివారం పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. ఓవైపు భారీ వర్షం కురుస్తున్నా పంపిణీ ఆగలేదు. ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. ఉమాపతి నాయుడు భారీ వర్షంలోనూ పింఛన్ల పంపిణీ చేశారు. బీజేపీ, టీడీపీ నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ, మల్లికార్జున, బుద్ధారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: కలుగొట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గ్రామంలో పింఛన్‌లను అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పార్లపల్లి మల్లికార్జున, కొండన్నగౌడ్, రామలింగడు, శంకర్‌గౌడ్, సురేష్ చౌదరి పాల్గొన్నారు.

పత్తికొండ: రామచంద్రాపురం గ్రామంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఇంటింటికి తిరుగుతూ పింఛన్ పంపిణీ చేశారు. వర్షంతో సీఎం పర్యటన రద్దు అయిందని, మరోసారి మాట్లాడి ఒప్పిస్తానని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, కాకర్ల లక్ష్మీనారాయణ, బత్తిని లోక్‌నాథ్, వెంకటపతి, కడవల సుధాకర్ ఉన్నారు. గ్రామంలోని గంగమ్మదేవాలయం విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పత్తిపాటి ప్రకాష్, శ్రీకాంత్‌చౌదరి, ఓబులేష్‌చౌదరి, రామ చంద్రారెడ్డి ఉన్నారు.

దేవనకొండ: ప్రభుత్వ నిర్ణయం మేరకు ఒకరోజు ముందుగానే మండలంలో 96 శాతం పంపిణీ చేసినట్లు 7449 మందికిగాను 7167 మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీవో గౌరిదేవి తెలిపారు.

ఆదోని రూరల్: మండలంలో 11,690 మంది ఉండగా 11, 300 మందికి పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీవో గీతావాణి తెలిపారు.

మద్దికెర: మండలంలో 98 శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో నరసింహమూర్తి తెలిపారు.

తుగ్గలి: మండలంలో 7,668 పింఛన్లు ఉండగా, ఇప్పటికే 95 శాత పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు. మిగతా 5 శాతం 2వ తేదీ సోమవార పంపిణీ చేస్తామన్నారు. టీడీపీ నాయకులు తిరుపాల్‌నాయుడు, అప్పా వేణుగోపాల్, రవి యాదవ్, సర్పంచులు చౌడప్ప, ఓబులేసు, ప్రతాప్ యాదవ్, శ్రీనివాసులు, డా.చంద్రశేఖర్, వెంకట్రాముడు గౌడ్ పాల్గొన్నారు.

ఆలూరు: సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి అన్నారు. ముద్దనగేరిలో పింఛన్లను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ గోపి పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, టౌన్ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ శివప్పనగర్, 1వ వార్డు లో పింఛన్లను అందజేశారు. హనుమాన్ నగర్‌లో తెలుగురైతు జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవరాజు, గోతులదొడ్డిలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, వల్లూరులో తెలుగు రైతు విభాగం కార్యదర్శి అడివప్ప గౌడ్‌పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని బినిగేర, అలిగేర గ్రామాల్లో టీడీపీ నాయకులు వీరభద్ర గౌడ్, కన్వీనర్ పరామరెడ్డి, ఎంపీటీసీ రహిమతుల్లా, నారాయణ, ఈరన్న, ఎస్ఎంసీ చైర్మన్, పరమేష్, మాబు పాల్గొన్నారు.

మంత్రాలయం: తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి అన్నారు. మంత్రాలయం, మాధవరం, సూగూరు, వగరూరు, చెట్నహళ్లి పింఛన్లు అందజేశారు. టీసీ సెల్ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, రఘునాథరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, భాస్కర్ రెడ్డి, అబ్దుల్లా, చావిడి వెంకటేశ్, విజయ రామి రెడ్డి, యోబు, వేణుగోపాల్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలో 9,108 పింఛన్లు ఉండగా, 8,812 పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పెద్దకడుబూరు: మండల కేంద్రంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి ఎస్సీ కాలనీలో ఎస్సీ సెల్ నాయకులు ఏసేబు, చిన్నకడబూరులో టీడీపి నాయకుడు నరసన్న ఫించన్ల పంపిణీలో పాల్గొన్నారు.

కోసిగి: ఆర్లబండలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సర్పంచ్ మజ్జిగ మల్లికార్జున, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీలు తోవి రామకృష్ణ, చింతలగేని నర్సారెడ్డి ఇంటింటికి వెళ్లి పించన్లను పంపిణీ చేశారు. అయ్యప్ప, ఈరయ్య, రామన్న, వాల్మీకి హనుమేష్, నాగులు, నారాయణ, చిన్న నరసయ్య, కురువ దేవ, గంగారామ్ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి: సీపీఐ

గోనెగండ్ల, ఆగస్టు 31: మండలంలోని అలువాల గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఐ కార్యదర్శి నాగన్న శనివారం డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు వీదులలో పర్యటించారు. వీరేష్, ఈరన్న, నాగేష్, దుబ్బన్న, వెంకటేష్, రంగన్న పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 31: పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా సెప్టెంబరు 1న చేపట్టనున్న చలో కలెక్టరెట్‌ను విజయవంతం చేయాలని ఏస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన యూపిఎస్, జీపీఎస్‌లకు వ్యతిరేకంగా కర్నూలు కలెక్టరెట్ వద్ద నిరసన తెలుపుతున్నట్లు అన్నారు.

ప్రభుత్వ పథకాలు అందించాలి

ఆదోని టౌన్, ఆగస్టు 31: జంగమహేశ్వరులు, అర్చకులు పథకాలు అందేలా చూడాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి వాణి విజయ్ కుమార్ కోరారు. శనివారం ఎంపీ నాగరాజును కలిశారు. అలకూరు మఠం మహర్షి విజయ్ కుమార్, వీరేష్, చంద్రశేఖరయ్య, జగదీశ్వరయ్య పంచాక్షరి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ ఆగస్టు 31: కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్ర శనివారం అన్నారు. వివరాల మేరకు.. ఎమ్మిగనూరుకు చెందిన అజాం, ఆదోని పట్టణానికి చెందిన రాజు బైక్‌లో కర్ణాటక మద్యంను తరలిస్తుండగా, అదుపులో తీసుకొని 720 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశ. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ తెలిపారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజమే

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 31: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని ఆర్టీసీ ఈయూ కార్యదర్శి మద్దిలేటి అన్నారు. శనివారం డిపోలో డ్రైవర్ ఎస్‌వి కుమార్ పదవీ విరమణ సన్మాన సభ ఈయు జిల్లా అధ్యక్షుడు రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి మదిలేటి ఎఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు రంగస్వామి మాట్లాడుతూ 32 ఏళ్లపాటు డ్రైవర్‌గా యూనియన్ అధ్యక్షులుగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. సుధాకర్ మేషయరాజు, మజీద్ ఏవి రెడ్డి, సామెల్ లక్ష్మణ, ఉలిగప్ప పాల్గొన్నారు.